జీహెచ్‌ఎంసీ నాటే.. హెచ్‌ఎండీఏ తొలగించే !


హెచ్‌ఎండీఏ తొలగించిన మొక్కలు

- అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో రెండేళ్లుగా పెంచిన మొక్కలు
- మరోరకం మొక్కల ఏర్పాటుకు సిద్ధమైన హెచ్‌ఎండీఏ
- ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో పెంచిన వాటికి ముప్పులేదంటున్న హెచ్‌ఎండీఏ
- కిలోమీటర్ లేని రోడ్డు సుందరీకరణకు ప్రజాధనం వృథా

అంబర్‌పేట: జీహెచ్‌ఎంసీ పెంచిన మొక్కలను హెచ్‌ఎండీఏ తొలగించింది. జీహెచ్‌ఎంసీ హార్టీకల్చర్ విభాగం దాదాపు రెండేళ్లు కష్టపడి పెంచిన మొక్కలను సుందరీకరణ పేరిట హెచ్‌ఎండీఏ విభాగం అధికారులు వాటిని తొలగించారు. రెండేళ్ల క్రితమే దాదాపు రూ.30 లక్షల నిధులు ఖర్చు చేసి అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ఉన్న రోడ్డుకు ఓ వైపు భారీగా సుందరీకరణ చేపట్టారు. దీనిలో భాగంగా భారీ ఎత్తున మొక్కలు తీసుకొచ్చి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వివిధ రకాల మొక్కలను పెంచారు. వేసవిలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి రోడ్డుకు పచ్చదనం అందేలా చేశారు.

దాదాపు రూ.60 లక్షల ప్రజాధనం వృథా..

సీపీఎల్ రోడ్డుకు ఏపుగా పెరిగిన మొక్కలను హెచ్‌ఎండీఏ సుందరీకరణ పేరిట తొలగించింది. పెరిగిన మొక్కల స్థానంలో మరోరకం మొక్కలు ఏర్పాటు చేస్తారని అధికారులు చెబుతున్నారు. తాజాగా అదే స్థానంలో మరోరకం మొక్కలు పెంచేందుకు హెచ్‌ఎండీఏ దాదాపు రూ.25 లక్షలు ఖర్చు చేయడానికి సిద్ధమవుతోందని సమాచారం. కిలోమీటరు దూరం కూడా సరిగ్గాలేని రోడ్డుకు కేవలం ఓ వైపు సుందరీకరణకు రెండేళ్లలో ప్రభుత్వ విభాగాల చర్యలతో దాదాపు రూ.60 లక్షల ప్రజాధనం వృథా అవుతోందని పలువురు స్థానికులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితమే ప్రస్తుతం ఏర్పాటు చేసే మొక్కలను అప్పుడే నాటితే ప్రజాధనం ఆదా అయ్యేదని ప్రజలు పేర్కొంటున్నారు.


అంబర్‌పేట సీపీఎల్ రోడ్డులో జీహెచ్‌ఎంసీ పెంచిన మొక్కలు

సుందరీకరణ కోసమే..

సివిల్ పనులు పూర్తికాగానే తాము మొక్కలను పెంచుతాం. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన మొక్కలను తాము ధ్వంసం చేయలేదు. అక్కడ పెరిగిన మొక్కలను ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియతో వేరే చోటుకి తరలించాం. కొన్ని మొక్కలను జీహెచ్‌ఎంసీ వారు అక్కడి నుంచి తీసుకెళ్లారు. తొలగించిన ప్రతి మొక్క తిరిగి 20 మొక్కలుగా పెరుగుతాయి. సీపీఎల్ రోడ్డులో కొత్త డిజైన్ ఇస్తామన్నారు. దానికి అనుగుణంగా తాము మొక్కలను ఏర్పాటు చేస్తాం.

– రాధారాణి, హెచ్‌ఎండీఏ హార్టికల్చర్ విభాగం అధికారిణి

క్లుప్తంగా

దోమల నివారణపై అవగాహన అవసరం

అంబర్‌పేట: దోమల నివారణ పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ కోరారు. ఆదివారం ఆయన జీహెచ్‌ఎంసీ ఎంటామలాజీ విభాగం సిబ్బందితో కలిసి దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాలతో నిలిచిన నీటిలో దోమల లార్వాలు పెరిగే ఆవకాశం ఉంటుందని వాటిపై దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. ప్రజలు సైతం ఇంటి పరిసరాల్లో పాత వస్తువుల్లో నీరు లేకుండా చూడాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఎంటమలాజీ విభాగం సిబ్బంది, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు లవంగం ఆంజనేయులు, మహేష్‌ముదిరాజ్, నాగరాజు, జమిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ దివ్యాంగులను ఆదుకోవాలి


సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నిరుద్యోగ దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల ఆర్థికసాయాన్ని అందించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల బంధును ప్రవేశపెట్టడంతో పాటు ధరల పెరుగుదలకు అనుగుణంగా వికలాంగుల పెన్షన్ రూ.10 వేలకు పెంచాలన్నారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి రూ.25 వేల ప్రత్యేక అలియన్స్ ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి దశలవారీగా రాజీలేని పోరాటం చేస్తామన్నారు. వివిధ సంఘాల నాయకులు వెంకట్, ఎం.శ్రీనివాసులు, గంగారామ్, కిరణ్, నాగేశ్వర్‌రావు, లింగస్వామి, రమేష్ తదితరులున్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కవాడిగూడ: పేద ఆర్యవైశ్యులను ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం ముషీరాబాద్‌లోని వైద్య హాస్టల్లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్రశాఖ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీంద్ర ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018లో సీఎం కేసీఆర్ వైద్య కార్పొరేషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారని వెంటనే వైశ్యులకు మేలు జరిగేలా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రతినిధులు రమణయ్య, ఎల్.వీ. కుమార్, బాలరాజు, కమలాకర్, మురళీ, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ రాష్ట్ర అధ్యక్షుడు నీల జయదేవ్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌జీఓస్ అసోసియేషన్స్ తెలంగాణ ఆధ్వర్యంలో సూట్స్ కేర్ నెట్‌వర్క్, అక్షర ఫౌండేషన్ సౌజన్యంతో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నీల జయదేవ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలన్నీ ఒక వేదికను ఏర్పాటు చేసుకుని సమిష్టిగా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఎన్‌జీఓస్ అసోసియేషన్ తెలంగాణ అధ్యక్షుడు యాస రామ్‌కుమార్‌రెడ్డి, ప్రతినిధులు డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ భవానీశేఖర్, ఐలా ఈశ్వరయ్య, నిమ్మయ్య, చక్రవర్తి, సీమాఖాన్, వాసుదేవ, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

'బహుజన వర్తమానం' పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత దండి వెంకట్ రచించిన 'బహుజన వర్తమానం' పుస్తకాన్ని ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు ఆవిష్కరించారు. మనువాదానికి వ్యతిరేకంగా ఉద్యమించడమే మాక్సిజమన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. దేశంలో కులం, వర్గం పెనవేసుకున్న ఆధిపత్య దోపిడీ వ్యవస్థ స్థానంలో బహుజన శ్రామికవర్గ ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం జరగాలంటే బహుజనులంతా ఐక్యం కావాలన్నారు. బీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.సిద్ధిరాములు, బీఎల్‌ఎఫ్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్, నాయకులు బొజ్జ భిక్షమయ్య, లత, కె.పర్వతాలు, తోకల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ తెలంగాణ' ప్రతి ఒక్కరి బాధ్యత


బాగ్‌అంబర్‌పేటలో 'స్వచ్ఛ తెలంగాణ'లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: స్వచ్ఛ తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం బాగ్‌అంబర్‌పేట్ డివిజన్‌లో నిర్వహించిన స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమానికి ఆయన హాజరై పార్టీ శ్రేణులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధానంగా వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నాలాల్లో పడి వర్షపునీటి ముంపు సమస్యకు ప్రధాన కారణమవుతుందన్నారు. స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందజేయాలని, ప్రజలు వీధుల్లో చెత్త వేయొద్దని ఆయన కోరారు. స్థానిక ప్రతినిధులు కవితారావు, భారతిరెడ్డి, ఉషారాణి, పద్మజ, చంద్రమోహన్, పులిజాల గెల్వయ్య, రవీందర్‌రావు, నిరంజన్, రవీందర్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు..

రాష్ట్ర ప్రభుత్వం పేదల వైద్యం కోసం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. పేదలకు ప్రభుత్వ వైద్యంతో పాటు వారు పొందుతున్న ప్రైవేటు వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింద ఆర్థికసాయం అందిస్తోందన్నారు. ఆదివారం శివంరోడ్డులో ఓ హోటల్‌లో అంబర్‌పేట జోన్ కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అండ్ ఆర్‌ఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య మందుల వాడకంపై అవగాహన కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ లక్ష్మీనారాయణలతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పేదలు ఆనారోగ్యానికి గురైతే మొదట బస్తీల్లోని మెడికల్ దుకాణాలు, ఆర్‌ఎంపీల వద్దకే వస్తారని, వారికి సేవా భావంతో భరోసా ఇవ్వాలని సూచించారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులున్నా అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మంత్రి హరీష్‌రావు కృషితో వైద్యరంగం పటిష్టమవుతుందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పులిజాల గెల్వయ్య, మధుసూదన్ రెడ్డి, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా


పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాలో బీజేపీ నాయకులు

అంబర్‌పేట: గుంపుగా వచ్చి దుకాణం యాజమానిపై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయడంలో జాప్యంపై బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పోలీసులను ప్రశ్నించారు. ఈ నెల 22న గోల్నాకలోని ఓ డిజిటల్ ప్రింటింగ్ దుకాణంలో పనిచేసే వ్యక్తి ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో అతడిని దుకాణం యజమాని తొలగించారు. దీంతో అతను తన స్నేహితులు, బంధువులతో కలిసి గోల్నాకలోని దుకాణంపై ముకుమ్మడిగా దాడి చేశాడు. ఈ దాడిలో పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో ముగ్గురిని అరెస్టు చేయగా.. మరో పదిమందిని అరెస్టు చేయాల్సి ఉంది. దాడిలో పాల్గొన్న అందరినీ అరెస్టు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ.. ఆదివారం బీజేపీ శ్రేణులతో అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు పద్మావెంకట్‌రెడ్డి, అమృత, నాయకులు శ్యామ్‌రాజ్, రవీందర్‌గౌడ్, వనం రమేష్, కన్నె రమేష్‌యాదవ్, నాగభూషణంచారి, యశ్వంత్, అచ్చిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు 'కరాటే' చక్కటి సాధనం


కరాటే కలర్ బెల్ట్స్ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ఆత్మరక్షణ కోసమే కాకుండా ఆరోగ్యానికి 'కరాటే' చక్కటి సాధనంగా ఉపకరిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. వైజీటీపీ తైక్వాండో కరాటే అకాడమీ హెడ్ కోచ్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలో కరాటేలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో 38 మంది విద్యార్థులు పోటీపడగా.. అర్హత సాధించిన 30 మంది విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు కలర్ గ్రేడింగ్ బెల్టులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరాటేతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. సంధ్య, స్మిత, వేణుగోపాల్, వాసు, ప్రభు, నర్సింగ్‌రావు, భవాని, చంద్రకాంత్ భీష్మ, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో..


పిల్లలకు బెల్ట్‌లు, సర్టిఫికేట్లు అందజేసిన అతిథులు, నిర్వాహకులు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ కెనరాబ్యాంక్ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ తైక్వాండో మార్షల్ ఆర్ట్స్, హైదరాబాద్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాస్టర్ బి.కృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం బెల్ట్ గ్రేడింగ్స్, బెల్ట్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తైక్వాండో అసోసియేషన్ నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కోచ్‌లు మనీష్, కార్తీక్, స్వామి, తైక్వాండో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి: సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి లక్ష్మీనగర్‌కాలనీ శ్రీ వేంకటేశ్వరాలయం చైర్మన్ వైఎస్‌ఆర్‌మూర్తి అన్నారు. ఆదివారం రాత్రి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా నృత్య కళాకారిణి కె.రాజేశ్వరి తన శిష్యబృందంతో నృత్య నీరాజనం కార్యక్రమం సమర్పించారు. ఈ సందర్భంగా నృత్యకళాకారులను ఆయన సన్మానించారు. ఓరుగంటి రామచంద్రమూర్తి, కనకదుర్గ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బానుప్రసాద్, ప్రసాదరామారావు, సాయిరామ్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ.. కేసు నమోదు

అంబర్‌పేట: ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో నివసించే అమరున్నీసా బేగం కుటుంబం ఈ నెల 28న సంతోష్‌నగర్‌లో ఉండే బంధువులు ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి వంటగది నుంచి ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలో ఉన్న 8.5 తులాల బంగారు నగలు, 40 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం బంధువుల వద్ద నుంచి ఇంటికి తిరిగి రాగా.. ఇంట్లోని బీరువా తాళాలు తీసి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వినయ్‌కుమార్

కవాడిగూడ: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. ఈ మేరకు ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని బ్యాంక్ కాలనీలో బీఆర్‌ఎస్ నగర యువజన విభాగం నాయకుడు రవీంద్ర కోక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ముఠా జైసింహ మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్ శ్రీనివాస్ (జగన్)నేతృత్వంలో పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆంజనేయులు, శివ, రాజేష్, రాముగౌడ్, సత్యనారాయణ, నరేందర్‌చారి తదితరులున్నారు.

చిక్కడపల్లి: ఉచిత వైద్యశిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగర బీజేవైఎం మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ సూచించారు. కిమ్స్ సన్‌షైన్ ఆసుపత్రి ప్యారడైజ్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్యపరీక్షలు నిర్వహించి, రిపోర్టులు అందజేశారు. పేద ప్రజలు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కిరణ్‌కుమార్, రాజు, అశోక్, సౌమ్య, రేఖ, సంధ్య తదితరులున్నారు.

విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం

కవాడిగూడ: విద్యార్థుల చదువు కోసం తగిన సహాయం అందజేస్తానని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కవాడిగూడలోని బండమైసమ్మనగర్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇల్లు కూలిపోయి అనాథలైన బాధిత చిన్నారులకు ఆర్థికసాయం అందజేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు కల్వగోపి, శివ, బాలయ్య, సన్నీ, మధు, రంజిత్‌లు వి. శ్రీనివాస్‌రెడ్డిని కోరగా.. నాయిని నర్సింహారెడ్డి ఫౌండేషన్ తరఫున ఆయన రూ.10 వేల చెక్కును బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుకు ఎలాంటి సాయమైనా అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం తాత్కాలికంగా తమ నాయకుడు అభిషేక్ ఇంట్లో వారికి ఆశ్రయం కల్పించామన్నారు. నాయకులు నేత శ్రీనివాస్, శ్యామ్, కార్తీక్ యాదవ్, టక్కర్, సిద్దిఖ్, సాయియాదవ్, అజ్జు, సాయియాదవ్, లవ, రాజేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మన్‌కీ బాత్ వీక్షించిన నేతలు


తిలకిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

అంబర్‌పేట: ప్రధాని మన్‌కీ బాత్ దేశానికి దిక్సూచిగా నిలుస్తుందని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీతా కాలనీలో ఆమె పార్టీ శ్రేణులతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, శక్తి ప్రముఖ ఎల్.శ్రీనివాస్, చుక్కా జగన్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ: ప్రధాని మన్‌కీబాత్ కార్యక్రమాన్ని కాచిగూడ డివిజన్ బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలు తిలకించారు. కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, కృష్ణ కుమార్, శేర్‌సాగర్, భీమ్ రాజ్, ఓంప్రకాష్, ఆర్.సంతోష్, సూరి, జగ్గు, రాము తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సమస్యకు పరిష్కారం రాష్ట్రపతి పాలనే !


సదస్సులో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మణిపూర్ రాష్ట్రంలో సమస్యకు పరిష్కారం ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని రద్దు చేయడంతో పాటు రాష్ట్రపతి పాలనే శరణ్యమని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఎంసీపీఐ(యూ) పొలిట్ బ్యూరో సభ్యులు రవి, కిరణ్‌జిత్‌సింగ్, నాగభూషణం, శ్రీకుమార్, మహేందర్‌నేహ, అనుభవ్ దాస్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

- కేంద్రం అండతోనే మణిపూర్‌లో మహిళల నగ్న ఊరేగింపు జరిగిందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ మంటలకు కారకులు ఎవరు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సామాజిక విశ్లేషకురాలు దేవి, కేవీపీఎస్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి రాములు, నాగార్జున, కురువయ్య, ఆరూరి కుమార్, ఎం.ప్రకాష్, రాధాకృష్ణ తదితరులున్నారు.
- మణిపూర్‌లో నివసిస్తున్న కుకీలకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని తెలంగాణ డెమొక్రటిక్ ఫ్రంట్ కన్వీనర్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి నుదుమల్ల వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

వడ్డేపల్లి కృష్ణకు అవార్డు ప్రదానం

చిక్కడపల్లి: కమనీయ కవితా వారసుడు వడ్డేపల్లి కృష్ణ అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు అన్నారు. తెలుగు భాషా చైతన్యసమితి ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయగానసభలో మహాకవి దాశరథి, డాక్టర్ సి.నారాయణరెడ్డి జయంతి సందర్భంగా ప్రముఖ కవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణకు దాశరథి స్మారక పురస్కార ప్రదానోత్సవం నిర్వహించారు. దాశరథి, సినారెల అసలైన కవితావారసుడు వడ్డేపల్లి కృష్ణ అని ప్రశంసించారు. ఘంటా మనోహర్‌రెడ్డి బడేసాబ్, గౌరీశంకర్, నాళేశ్వరం శంకరం, రామకృష్ణచంద్రమౌళి, వీకే దుర్గ, సరోజినీదేవి, అంజనీకుమారి, కర్నాటి రఘు రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం


ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు

నల్లకుంట: శ్రావణమాసం సందర్భంగా నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ వేడుకలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.సురేష్ యాదవ్ ఆధ్వరంలో భారీ తొట్టెలను ఊరేగించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ మంత్రి కృష్ణయాదవ్, నల్లకుంట కార్పొరేటర్ అమృత, బీజేపీ గద్వాల జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌రెడ్డి, బాగ్ అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పద్మావతి డీపీరెడ్డి తదితరులు ఈ వేడుకలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నాయకులను శాలువాతో సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

రత్నానగర్‌లో అన్నదానం..

- శ్రావణమాసం సందర్భంగా ఆదివారం నల్లకుంట డివిజన్ రత్నానగర్‌లోని ముత్యాలమ్మ, బంగారు మైసమ్మ ఆలయంలో అమ్మవారికి మారు బోనం నైవేద్యం సమర్పించారు. అనంతరం బస్తీవాసులకు అన్నదానం చేశారు. రత్నానగర్ బస్తీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్, ప్రధాన కార్యర్శి ఎంబీ. కిశోర్‌కుమార్, ఉపాధ్యక్షుడు నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శి వీరయ్యగౌడ్, కోశాధికారి సతీష్‌చంద్రగౌడ్ బస్తీవాసులు పాల్గొన్నారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో తెల్ల ఉప్పలమ్మ దేవాలయంలో శ్రావణమాస బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. మన పండుగలు మతసామరస్యాన్ని కాపాడేలా ఉండాలని సూచించారు. దేవాలయ అధ్యక్షుడు బబ్లూ, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కోశాధికారి ఎం.ఎస్.రావు, ఉపాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌గౌడ్, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, యువజన నాయకులు ముఠా జైసింహ తదితరులున్నారు.

ఉప్పలమ్మ దేవాలయంలో..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని లక్ష్మీ ఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలయ చైర్మన్ సంజీవరెడ్డి, సోనమ్, దీపాకుమారి, శరణ్య, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, స్వామిరెడ్డి, నగర కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, బీఎస్ కృష్ణయాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఎంఎస్ రాధ, పద్మ, భానుమతి, పవన్, విజయ్‌కుమార్, సతీష్‌కుమార్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ కార్పొరేటర్ పద్మావతి తదితరులు


కాంగ్రెస్‌నేత అనిల్‌యాదవ్, సంజీవరెడ్డి, సోనమ్


తొట్టెల ఊరేగింపులో కార్పొరేటర్ అమృత, వెంకట్‌రెడ్డి